www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

బుధవారం, 10-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :41 Issue : 41 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



## విశాఖ స్టీల్ ప్లాంట్ లో భారీ అగ్నిప్రమాదం..

**విశాఖపట్నం, ఆశ్వి అప్డేట్స్**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాద ఘటన అత్యంత విషాదకరం అని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, హోంమంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్‌తో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గాయపడిన కార్మికులను పరామర్శించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను, బాధి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## ఫుల్ స్వింగ్ లో కింగ్ 100 షూటింగ్



8

# కేబినెట్ కసరత్తుతో కాంగ్రెస్‌లో కలకలం

- ఢిల్లీ బాట పట్టిన ఆశావహులు.. పెరుగుతున్న లాబీయింగ్
- రాహుల్‌ను కలిసిన రాజగోపాల్ రెడ్డి
- మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న సీనియర్ నేత
- సామాజిక సమీకరణాలే అధిష్టానానికి సవాల్
- అసంతృప్తి స్వరాలు పెరగకుండా జాగ్రత్తలు
- తెలంగాణలో ఆచితూచి అడుగులు వేస్తున్న హైకమాండ్



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్టానం ముగించినప్పటికీ అక్కడి అసంతృప్తి పూర్తిగా చల్లారలేదనే చర్చ కొనసాగుతోంది. ఇదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు అంశం ప్రస్తుతం లేదనే సంకేతాలు ఉన్నా, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణకు త్వరలోనే గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశం ఉందన్న ప్రచారం జోరందుకుంది. దీంతో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న సీనియర్ నేతలు,

మిగతా 2వ పేజీలో..



# మహిళా సాధికారతకు మరో అడుగు

మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ

- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫ్యామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన9, ఆశ్వి అప్డేట్స్**

మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది

మిగతా 3వ పేజీలో..



## ప్రజల కోసం పనిచేసే ఇందిరమ్మ రాజ్యం

- పదేళ్లలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు
- డిస్కంలను ముంచేసి ఇప్పుడు కల్లాల్లోకి వస్తామంటారా?
- ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం ఎందుకు కొనడం లేదు?
- హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారు
- త్వరలో 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా
- ఒకే విడతలో రూ.22 వేల కోట్ల రైతు రుణ మాఫీ
- 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.60 కోట్లతో విద్యుత్ పనులు
- బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**స్టేషన్ ఘన్‌పూర్, ఆశ్వి అప్డేట్స్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆరఎస్‌లు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ

మిగతా 2వ పేజీలో..

## ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి



- బీఆర్ఎస్ లీడర్ హరీశ్ రావు

**హైదరాబాద్, జూన్ 9 :**

మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డీ.. ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల గౌరవాన్ని నిలబెట్టుకో అని అసెంబ్లీలో బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో..



## హైదరాబాద్ అతలాకుతలం!

- మంగళవారం సాయంత్రం భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు.. భారీగా ట్రాఫిక్ ఇక్కట్లు
- విద్యుత్ షాక్ తో ఇరువురి మృతి
- గచ్చిబౌలి లో చెరువును తలపించిన రోడ్డు!

2

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు



- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టుకుపోతాయన్న ఎన్‌డీఎసఏ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల

మిగతా 2వ పేజీలో..



3

## ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

- పాలేరు నియోజకవర్గంలో 'ప్రజా దర్బార్' విజయవంతం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



## మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆరఎస్

- ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు
- మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

3




## జీహెచ్ఎంసీ ఎన్నికలకు బండి సంజయ్ దూరమా?

- ప్రచార బాధ్యతలపై కమలం పార్టీలో చర్చ
- హైదరాబాద్ నేతలతో కనిపించని సఖ్యత
- ఎన్నికలకు పూర్తిగా దూరమైతే సెల్ఫ్ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందని భావన
- వరంగల్‌పైనే ఆసక్తి చూపుతున్న కేంద్ర మంత్రి?

3

## మైనారిటీల ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్
- చరిత్రాత్మక మెగా జాబ్ మేళా ఘనంగా ప్రారంభం



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మైనారిటీల సంక్షేమ శాఖ, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీఎంఎఫ్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మెగా

మిగతా 3వ పేజీలో..



## ఆదాయానికి మించి 300శాతం ఆస్తులు!

- ఏసీబీ వలలో ఆర్అండ్‌బీ అధికారి మోహన్ నాయక్
- మియాపూర్‌లోని ఇంట్లో రూ. 65 లక్షల నగదు, బంగారు బిస్కెట్లు లభ్యం

2



## బాసర గోదావరిలో ముగ్గురి గల్లంతు

**నిర్మల్, జూన9, ఆశ్వి అప్డేట్స్**

నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మంగళవారం గల్లంతయ్యారు. సాయంత్రం వారి మృతదేహాలు బయట పడ్డాయి. ఈ ఘటనతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం ఇవాళ వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు నీటిలో మునిగిపోయారు. మాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లతో రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కొన్ని గంటల పాటు గాలించాక.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు గజ ఈతగాళ్లు. మృతులను చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు. ముగ్గురూ సొంత అన్నదమ్ములేనని అధికారులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన బాసర, కాచిగూడలో తీవ్ర విషాద ఛాయలు నింపగా, స్థానికులను కూడా కలచివేసింది. గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.

## ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల మంది అంగన్‌వాడీల కష్టాలు మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నెలలతరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్‌వాడీలను వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారని, వారి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి ఆ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆరఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.7,800లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించామన్నారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని, కానీ రెండున్నరేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రెటేరియట్‌కు పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి కర్కశంగా వ్యవహరించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి.. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీకొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండని హితవు పలికారు. అంగన్‌వాడీల వేతనాలను చెల్లించాలని, అప్ గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు అన్నారు.



## హైదరాబాద్ అతలాకుతం !

**తెలంగాణ బ్యూరో ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ మహానగరంలో మంగళవారం ఆకస్మికంగా కురిసిన వర్షం నగరవాసులను ఇబ్బందుల పాలు చేసింది. విద్యానగర్, కాచిగూడ, గచ్చిబౌలి,ఐకియా సర్కిల్ తదితర ప్రాంతాలలో వర్షం మూలంగా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దింతో గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్లో చిక్కుకోవాల్సి వచ్చింది.

**చెరువును తలపించిన గచ్చిబౌలి రోడ్లు!**

గచ్చిబౌలి ప్రాంతంలో మంగళవారం వర్షం భారీగా కురియడంతో రోడ్లు చెరువులను తలపించాయి.వాహన దారులు కాలువల పైనుండి ప్రయాణం చేయాల్సి వచ్చింది.చాల చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

**పాతబస్తీలో ఇద్దరు మృతి**

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఇద్దరు యువకులు షార్ట్ సర్క్యూట్ వల్ల చనిపోయారు. ఎల్టీ ఏబీ కేబుల్ వర్షానికి జారీ వారి పైన పడటంతో మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. జాఫర్ (25 )స్పాట్ లోనే చనిపోయాడు అబూ (16 )ఒవైసీ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్టు అధికారులు తెలిపారు.

**గంటల తరబడి ట్రాఫిక్ లోనే !**

అనుకోకుండా కురిసిన వర్షం మూలంగా హైదెరాబాద్ లోని చాల ప్రాంతాల్లో భారీగానే వర్షం కురిసింది. దింతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాల చోట్ల గంటల తరబడి రోడ్లపైనే ఉండాలి వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఐతే ట్రాఫిక్ లో చిక్కుకొని జనం విలవిల్లాడారు. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. దాదాపు ప్రధాన కూడళ్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.



# ప్రజల కోసం పనిచేసే 'ఇందిరమ్మ రాజ్యం'

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆరఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు. గత బీఆరఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ.76 వేల కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోంది. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ.76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లం అని అన్నారు. పేదల సొమ్మంతా గత పాలకుల ఇళ్లకే పోయిందని, అందుకే పదేళ్లలో పేదలకు సన్న బియ్యం గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు.

**డిస్కంలను ముంచేసింది మీరు కాదా?**

పదేళ్లపాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆరఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బందిపడ్డాయన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ.14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ.5 వేల కోట్లను.. మొత్తంగా రూ.19 వేల కోట్లను ప్రతి నెలా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నామని చెప్పారు.. దీనిపై కూడా అభాండాలు వేయడం బీఆరఎస్ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.

**హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారు. గాలి కబుర్లు పోగేసి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారు. అధికారం పోవడంతో తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారు అని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



**రైతులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసిన బీజేపీ**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే కొనుగోలు చేసేదని, ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రం కొన్నా కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మద్దతు ధరతో మొక్కజొన్నలు కొంటున్నారా అని ప్రశ్నించిన ఆయన కేవలం తెలంగాణలోనే మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

**తగుదునమ్మా అంటూ కల్లాల్లోకి వస్తారా?**

రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే తగుదునమ్మా అంటూ బీజేపీ, బీఆరఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు అని ప్రశ్నించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని భట్టి స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ.22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

**పేదల గృహ నిర్మాణానికి పెద్దపీట**

గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తొలి విడతగా రూ.22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**మహిళా సాధికారతకు అండ**

మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ.67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ.1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు.

**స్థానిక సమస్యలపై సానుకూల స్పందన**

నియోజకవర్గంలో రూ.60 కోట్లతో సబ్‌స్టేషన్ల భూమి పూజలు, ప్రారంభోత్సవాలు జరిపారు. సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యాసాధ్యాల పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్‌ప్లాన్ నిధులు పెద్ద ఎత్తున వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పల్లగుట్టకు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్థానిక శాసనసభ్యుడు కడియం శ్రీహరి, పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, దొంతి మాధవరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

# కేబినెట్ కసరత్తుతో కాంగ్రెస్‌లో కలకలం

**మొదటిపేజీ తరువాయి**

ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేసి పార్టీ అగ్రనేతలతో భేటీలు నిర్వహిస్తున్నారు.

**రాహుల్‌ను కలిసిన రాజగోపాల్ రెడ్డి**

మంత్రి పదవుల రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ఆయన రాహుల్ గాంధీని కలిసి తనకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో అవకాశం చేజారిపోవడంతో ఈసారి ఎలాగైనా కేబినెట్‌లో చోటు సంపాదించాలనే పట్టుదలతో ఆయన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఆయనతో పాటు మరికొందరు సీనియర్ నేతలు కూడా ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రి పదవుల కోసం పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

**సామాజిక సమీకరణాలే అధిష్టానానికి సవాల్**

తెలంగాణ కాంగ్రెస్‌లో కేబినెట్ విస్తరణ అంత సులభమైన వ్యవహారం కాదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సీనియార్టీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండటంతో అధిష్టానానికి సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒక వర్గానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే మరో వర్గంలో అసంతృప్తి పెరిగే పరిస్థితి ఉంది. అదే విధంగా ఒక ప్రాంతానికి చెందిన నేతలకు అవకాశాలు పెరిగితే ఇతర ప్రాంతాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**కర్ణాటక అనుభవంతో అప్రమత్తమైన కాంగ్రెస్**

మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు తమకు ప్రాధాన్యం దక్కకపోతే బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కేబినెట్ కూర్పుపై కాంగ్రెస్ అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

కర్ణాటకలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ చేపట్టే విషయంలో హైకమాండ్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ మార్పులు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయా, లేక కొత్త అసంతృప్తికి దారితీస్తాయా అన్నది త్వరలో తేలనుంది

# ఆదాయానికి మించి 300శాతం ఆస్తులు!

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో మరో భారీ అవినీతి తిమింగలం అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏసీబీ అధికారులు అవినీతిపరుల భరతం పడుతున్నారు. ఒకరిని మించి మరొకరు అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్న ఉదంతాలు వరుస దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఈఎన్సీ మోహన్ నాయక్ ఇంట్లో ఏసీబీ అధికారులు జరిపిన సోదాల్లో విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. ఏకంగా ఆయన తన ఆదాయానికి మించి 300 శాతం అదనపు ఆస్తులు కూడబెట్టినట్లు అధికారుల విచారణలో తేలింది.

**9 చోట్ల ఏకకాలంలో దాడులు..**

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్అండ్‌బీ ఈఎన్సీ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 9 చోట్ల ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదుతో పాటు, కిలోల కొద్దీ బంగారం, బంగారు బిస్కెట్లు, పలు చోట్ల కొనుగోలు చేసిన భూముల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ. 65 లక్షల నగదు, భారీగా ఆస్తులు..**

మియాపూర్‌లోని మోహన్ నాయక్ నివాసంలో జరిపిన సోదాల్లో ఎలాంటి లెక్కలు చూపని రూ. 65 లక్షల నగదు లభించిందని ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. దీనికి తోడు నిజామాబాద్‌లో భారీగా వ్యవసాయ భూములు, హైదరాబాద్ నగరంలో అనేక చోట్ల ప్లాట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. కాగా, వీటి విలువ రూ.200కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో మూడేళ్ల సర్వీస్ ఉన్న ఈ అధికారిపై గతంలో అనేక ఆరోపణలు రావడంతోనే పక్కా సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.



# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

**మొదటిపేజీ తరువాయి**

ప్రొక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్ధాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు.

8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు.

తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో ముందు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎసఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎసఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆరఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్ధాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

# మైనారిటీల ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

జాబ్ మేళా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ మేళాను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిర్వహణకు కృషి చేసిన టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తోపాటు అన్ని విభాగాల అధికారులకు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లలో అమలుకాని అనేక కార్యక్రమాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేస్తోందని, మైనారిటీల సంక్షేమ శాఖ, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమన్వయంతో మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు తదితర



అన్ని మైనారిటీ వర్గాల యువతకు సమానావకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆఫర్ లెటర్ ఇవ్వడంతో తమ బాధ్యత ముగియదు.. అభ్యర్థి కంపెనీలో చేరే వరకు మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తాం.. యువతకు ఉపాధి కల్పించడం మా బాధ్యత, మా వాగ్దానం అని అజారుద్దీన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించి మరింతమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

యువత విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'టీజీఎంఎఫ్‌సీ ద్వారా అనేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.. యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ ప్రతిభను పెంపొందించుకోవాలి.. ఇంటర్వ్యూలలో పాల్గొని మంచి ఉద్యోగాలు సాధించాలి.. కృషి, పట్టుదల, నైపుణ్యాలే విజయానికి మార్గం' అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మైనారిటీ గురుకులాల వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి.షఫీఉల్లా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

**మెగా జాబ్ మేళా విశేషాలు**

మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ తన ఎంపానెల్డ్ ట్రైనింగ్ భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహించింది. ఈ మేళాలో 50 నుంచి 60 వరకు ప్రముఖ కంపెనీలు, హెచ‌ఆర్ ప్రతినిధులు పాల్గొని లాజిస్టిక్స్ అండ్ ఈకామర్స్, రిటైల్ అండ్ హాస్పిటాలిటీ, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ అండ్ అసెంబ్లీ, ఆటోమొబైల్ అండ్ మొబిలిటీ, నిర్మాణమౌలిక వసతులు, ఐటీఈఎస్/బీపీఓ, కార్పొరేట్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్ అండ్ హెల్త్‌కేర్, మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్‌లలో ఉద్యోగావకాశాలు కల్పించాయి. సుమారు 20 శిక్షణ సంస్థలు కూడా పాల్గొన్నాయి. గతంలో శిక్షణ పొందిన విద్యార్థులు, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కూడా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2,000 మంది మైనారిటీ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాలతోపాటు కెరీర్ కౌన్సెలింగ్ సేవలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల నమోదు ప్రక్రియ కూడా నిర్వహించారు.

## మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బీఆరఎస్

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆరఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆరఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆరఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

# మహిళా సాధికారతకు మరో అడుగు

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000



కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆరఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్య రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

**ఖమ్మం, జూన్ 9, ఆశ్వి అప్డేట్స్ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డితో కలిసి ఖమ్మంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

**14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24వేల పై దరఖాస్తులు**

నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి గత 25 నుండి 30 రోజులుగా ప్రజల వద్దకే ప్రభుత్వం అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి వారి సమస్యలను కళ్లారా చూసి, చెవులారా విన్నానని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11వేలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతోపాటు అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9.26లక్షల సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రిమండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామని చెప్పారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**డిజిటల్ సర్వే.. సాగులో ఉన్న వారికే భూమి పట్టాలు**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి)లో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొర పాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాల విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాక అన్ని పార్టీల పేదలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు ఏవైనా సరే ఓటరు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.

**నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు**

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారులను విభజించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.




## జీహెచ్ఎంసీ ఎన్నికలకు బండి సంజయ్ దూరమా?

**హైదరాబాద్, జూన్ 9, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ బీజేపీలో మరో ఆసక్తికర చర్చ సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన ఈసారి ఏ బాధ్యతలు చేపడతారన్న అంశంపై కమలం పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

పదవీకాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్లు, వివిధ కారణాలతో వాయిదా పడిన మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లు, వరంగల్, ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాయి. బీజేపీ కూడా గ్రౌండ్ స్థాయిలో కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఊహించని స్థాయిలో సీట్లు గెలుచుకుని ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఆ సమయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేపట్టిన ప్రచారం, ఆయన ప్రసంగాలు పార్టీకి భారీగా కలిసొచ్చాయని కేడర్ ఇప్పటికీ భావిస్తోంది. అనంతరం జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ మంచి ఫలితాలు సాధించడంలో బండి పాత్ర కీలకమనే అభిప్రాయం ఉంది.

అయితే ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బండి సంజయ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడు కాదు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు వంటి నేతలు ఉండటంతో జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచార బాధ్యతలు వారిపైనే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

పార్టీలోని కొందరు నేతలతో బండి సంజయ్‌కు సన్నిహిత సంబంధాలు లేకపోవడం, స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా ఆయన ప్రచారంపై ప్రభావం చూపే అవకాశముందని చర్చ జరుగుతోంది. ఈ కారణాలతో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రచారంపై ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే వరంగల్ ఎన్నికల విషయంలో మాత్రం బండి సంజయ్ ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. వరంగల్ బాధ్యతలు అప్పగిస్తే పూర్తిస్థాయిలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పార్టీ పెద్దలకు సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బండి సంజయ్‌కు పార్టీ ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుందన్న అంశం ఇప్పుడు బీజేపీ కేడర్‌లో ఆసక్తికర చర్చగా మారింది.

## మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణానికి హైకోర్టు బ్రేక్

**హైదరాబాద్, జూన్9, ఆశ్వి అప్డేట్స్**

మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణానికి అనూహ్యంగా బ్రేక్ పడింది. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన చేసిన ఈ భవన నిర్మాణం చేపట్టవద్దని హైకోర్టులో మొత్తం ఐదు రిట్ పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఆయా రిట్ పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ల వాదనలు విన్న అనంతరం, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణంపై 'స్టేటస్ కో' ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అక్కడ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టడానికి వీల్లేదని ధర్మాసనం పేర్కొంది. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం, కేసు తదుపరి విచారణను జూలై 7న వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. దీంతో సీఎం శంకుస్థాపన చేసిన కొద్ది రోజులకే కోర్టు స్టేటస్ కో విధించడంతో మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై రేవంత్ ఆగ్రహం

- **బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శ**
- **న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం**

**హైదరాబాద్, జూన్ 9, ఆశ్వి అప్డేట్స్:**

మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది బీజేపీ పన్నిన కుట్రేనని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రత్యర్థులను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. 'వోట్ చోరీ', 'ఎస్ఐఆర్' తర్వాత ఇప్పుడు బీజేపీ 'సీట్ చోరీ'కి పాల్పడుతోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, అయినప్పటికీ ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం స్పందించేందుకు ప్రయత్నిస్తే కూడా అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. జైరాం రమేష్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు వెళ్తే అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని, ప్రజల గొంతుకలను అణచివేసే చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్న ఆయన, ఈ ఘటనను ప్రతి పౌరుడు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.





## ముగ్గురిని కాపాడి అమరుడైన అనురూప్..

- **ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి, మందుల సామెల్ నివాళి...**

**ఆశ్వి అప్డేట్స్ రంగారెడ్డి జిల్లా :**

అమెరికాలోని సెబాన్ నదిలో ముగ్గురిని కాపాడి, ప్రాణాలు కోల్పోయిన అనురూప్ రెడ్డి మృతదేహానికి భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ నివాళి అర్పించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి.... వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా... గత నెల 30న స్నేహితులతో కలిసి లూసియానాలోని టోరోడో పార్కు వద్ద సెబాన్ నది వద్దకు వెళ్లారు. ముగ్గురు స్నేహితులు లోతులోకి వెళ్లి నీట మునగగా... అనురూప్ వారిని ఒడ్డుకు లాగి, తాను వస్తుండగా నదిలో వేసిన ఓ వల అతడి కాళ్లకు చుట్టుకుంది. ఈ క్రమంలోనే నీట మునిగి అనురూప్ ప్రాణాలు కోల్పోయారు. 10 రోజుల తర్వాత యువకుడి మృతదేహం కవాడిపల్లికి చేరుకోగా... గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనురూప్ మృతదేహం పై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళి అర్పించిన ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామెల్..... శోకసంద్రంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చారు. యువకుడి త్యాగానికి గుర్తుకు సీఎం రేవంత్ రెడ్డి పంపిన కమెండేషన్ లెటర్ ను వారు కుటుంబసభ్యులకు అందజేశారు. అనురూప్ సమయస్ఫూర్తితో ముగ్గురిని కాపాడినా.... తాను ప్రాణాలు కోల్పోవటం దురదృష్టకరమన్నారు. అనురూప్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



## సన్ని లియోన్‌కు షాక్.. సీఐడీ నోటీసులు!

**ఆశ్వి అప్డేట్స్**

బెళగావి శివం అసోసియేట్స్ అక్రమంగా కస్టమర్స్ నుంచి పెద్ద మొత్తంలో స్వీకరించిన నగదు డిపాజిట్లతో గత డిసెంబరులో నిర్వహించిన కన్నడ ఉత్సవంలో పాల్గొన్న నటులకు నోటీసులు జారీ చేసేందుకు సీఐడీ సిద్ధమైంది. నటులు డాలి ధనుంజయ, వశిష్ఠ సింహ, సప్తమీ గౌడ, రాగిణి ద్వివేది ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అయితే వారికి భారీగా డబ్బు అందినట్లు సీఐడీ అనుమానిస్తూ.. వారిని విచారించనుంది. అలాగే ఆ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర 2023లో తీసిన ఛాంపియన్ చిత్రంలో ఐటెం సాంగ్ లో సన్నీ లియోన్ డ్యాన్స్ చేసింది. ఆమెకు రెమ్యూనరేషన్ కింద రూ.కోటి ఇచ్చినట్లు రికార్డు పత్రాల ద్వారా సీఐడీ తెలుసుకుంది. దీనికి వివరణ ఇవ్వాలంటూ ఆమెకు నోటీసులు జారీ చేసింది...

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 9**

నారాయణపేట జిల్లా: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై సంచరిస్తున్న 12 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు వెంటనే నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య మాట్లాడుతూ... వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. వాహనాల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల విచారణ వంటి అంశాల్లో నెంబర్ ప్లేట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కొంతమంది వాహనదారులు నిబంధనలను పట్టించుకోకుండా నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నారని, అలాంటి వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోతే దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తించడం కష్టమవుతుందని, అందువల్ల ప్రతి వాహన యజమాని తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.

**ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు:**

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు.• ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.• కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి.• మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధం.• రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయరాదు.• ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదు.• ఆటోలలో అనుమతించిన సీట్ల సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించరాదు.• పాఠశాల విద్యార్థులను, కూలీలను ఆటోలలో అధిక సంఖ్యలో తీసుకెళ్లరాదు.• డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదు.• రేసింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్ చేయరాదు.• నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ వాహనాలు నడపాలి.• ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచికలను తప్పనిసరిగా అనుసరించాలి.

ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య కోరారు.



## గంజాయి రవాణాపై తుర్కపల్లి పోలీసుల దాడి

- **ముగ్గురు అరెస్ట్ - 250 గ్రాముల గంజాయి సీజ్_**
- **పల్సర్ బైక్, 3 మొబైళ్లు స్వాధీనం**

**ఆశ్వి అప్డేట్స్ యాదాద్రి భువనగిరి జూన్ 09 :**



జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా తుర్కపల్లి పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాలతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.

దాడి వివరాలు: విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖియుద్దీన్ సిబ్బందితో కలిసి రాంపూర్ గ్రామ శివారులో కాలువ ప్రక్కన నిఘా పెట్టారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభించింది. నిందితుల వివరాలు: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కర్కపట్ల నుంచి గంజాయి కొనుగోలు చేసి తుర్కపల్లిలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు.

1. గిరిమిల్ల సాయి మధు, 20, ప్రైవేట్ ఉద్యోగి, కర్కపట్ల, సిద్దిపేట జిల్లా
2. పసుల లింగ స్వామి, 19, వ్యవసాయదారుడు, కడిలబావి, రాంపూర్, తుర్కపల్లి మండలం
3. సయ్యద్ జావీద్, 20, ట్రాక్టర్ డ్రైవర్, కడిలబావి, రాంపూర్, తుర్కపల్లి మండలం

స్వాధీనం చేసినవి: 250 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు.

ఎస్పీ హెచ్చరిక: ఈ సందర్భంగా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని సహించబోమన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా *డయల్ 100*కు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పర్యవేక్షణ: ఈ కేసును ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, యాదాద్రి డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం. శంకర్ పర్యవేక్షించారు. తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖియుద్దీన్, సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 9**



ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జయ సుధ, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి నెల 100 కు పైగా ఫోన్స్ రికవరీ చేస్తున్న జిల్లా పోలీస్

- **జిల్లాలో 13 వ సారి బాధితులకు మొబైల్స్ అందించిన ఎస్పీ నరసింహ ఐపిఎస్.**



జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరికి గురైన సుమారు 20 లక్షల విలువగల 102 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగినది.
- ఆర్థిక పరమైన అంశాలకు ఈరోజుల్లో మొబైల్ ప్రదాన్యమైనది.
- సంవత్సర కాలంలో 1744 మొబైల్స్ ను బాధితులకు అందించాం.
- అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ఉండొద్దు.
- ఆదమరిచి ఉంటే ఆర్థిక నష్టం తప్పదు.
- మంచిని సమర్థించాలి, చెడును ప్రశ్నించాలి.
- పిల్లలకు కష్ట పడటం నేర్పండి. సామాజికంగా ఎదగడం నేర్పించండి.
- మేము మీ పోలీస్.

**....కె.నరసింహ ఐపీఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.**

ఈరోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 102 ఫోన్లను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారి చేతుల మీదుగా 13వ సారి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు (భాదితులకు) అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.... అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా ఉంటే నష్టాలు తప్పవు, అప్రమత్తంగా ఉండాలి సురక్షితంగా ఉండాలి అన్నారు, అత్యాశకు పోయి, ఆదమరిచి ఉన్నా సైబర్ మోసగాళ్లు ఆర్థిక నష్టం కలిగిస్తారు అన్నారు. సమాజంలో మంచిని సమర్థించాలి చెడును ప్రశ్నించాలి అప్పుడే మన భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించగలుగుతాం, సమాజంలో చెడు ఎక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరుగుతుంది సమాచారం ఇవ్వాలి, పిల్లలకు కష్టపడే తత్వాన్ని నేర్పించండి వృత్తుల పట్ల ప్రజల పట్ల సమాజం పట్ల గౌరవాన్ని సామాజికంగా ఎదగటాన్ని నేర్పించండి అని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం, ఆర్థిక పరమైన అంశాలకు వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారు, ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే CEIR పోర్టల్ ( https://www.ceir.gov.in ) నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసి ఈరోజు పెద్దమొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి ఇక్కడ భాదితులకు అందించడం జరిగినది అన్నారు.

**అత్యాశకు పోవద్దు**

ప్రజలు అత్యాసకు పోయి సైబర్ మోసాల బారిన పడోద్దు తక్కువ వడ్డీకి లోన్స్ ఉన్నాయి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు, బహుమతులు వచ్చాయి అంటే నమ్మి అపరిచితులకు డబ్బులు పంపవద్దు, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు, మీ పిల్లలు డ్రగ్స్, అమ్మాయిల రవాణా లాంటి కేసుల్లో చిక్కుకున్నారు డిజిటల్ అరెస్ట్ చేస్తాం అని CBI, CID లాంటి దర్యాప్తు సంస్థల పేర్లు చెప్పి డబ్బులు కడితే కేసు నుండి తప్పిస్తాము అంటారు ఇది నమ్మవద్దు డిజిటల్ అరెస్ట్ అబద్దం అన్నారు.

**ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీస్**

పోలీసు మీకోసం ఉన్నారు, ప్రజా భద్రతలో అనుక్షణం కృషి చేస్తున్నాము, మీ ప్రాంతాల్లో జరుగుతున్న అశాంఘిక చర్యలు, అక్రమ రవాణా పై పోలీసుకు సమాచారం ఇవ్వాలి, సమాజంలో జరుగుతున్న అసాంఘిక చర్యలు, అక్రమాలు, అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రశ్నించే ప్రతిఒక్కరు యూనిఫాం లేని పోలీసు, వీటిపై మాకు సమాచారం ఇవ్వండి మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం అన్నారు, ప్రజలు పోలీసులకు మిత్రులుగా ఉంటూ నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలి అన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ సైబర్ వారియర్స్, డ్రగ్స్ నిర్మూల వారియర్స్ లాగా ఉండాలి వీటిపై సమాచారం ఇస్తే మీరు పోలీసుతో భాగస్వామ్యం అయినట్లే, సైబర్ మోసాల గురించి చుట్టుపక్కల వారికి అవగాహన కలిగించాలి. పోలీసు శాఖకు ధన్యవాదాలు తెలిపిన మొబైల్స్ పొందిన బాధితులు.. పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు జిల్లా ఎస్పీ గారికి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను CEIR అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, IT కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ సైబర్ వారియర్స్, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.



## ప్రతి రైతు విత్తనాలు కోనేటప్పుడు రసీదు తీసుకోవాలి

- **ప్రభుత్వ పథకాల మీద అవగహన అవసరం**
- **డ్రగ్స్ మీద అవగాహన -చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 9**

నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం షేర్నపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరై గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించుకొని, పంటల బీమా చేయించి, నష్టాలను అధిగమించవచ్చని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచు కంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని, వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారాన్ని అందించేది వ్యవసాయమే. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ మరియు విద్యావకాశాలు కల్పిస్తే, వారి భవిష్యత్తు (దేశ భవిష్యత్తు) సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి జిల్లా




న్యాయ సేవా అధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి శైలజ (షేర్నపల్లి గ్రామా పంచాయతీ సెక్రటరీ) అనురాధ (గ్రామా సర్పంచ్), శ్యామప్ప (నారాయణపేట రురల్ కానిస్టేబుల్) భాగ్యరేఖ (అంగన్వాడీ టీచర్) వార్డ్ మెంబెర్స్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# ప్రపంచ రికార్డు సృష్టించిన మేఘా ఇంజనీరింగ్ అద్భుతం..

- **'జోజిలా టన్నెల్'ను ప్రారంభించిన నితిన్ గడ్కరీ!**

**ఆశ్వి అప్డేట్స్ ఢిల్లీ :**







భారతదేశ మౌలిక సదుపాయాల రంగంలో ఒక అద్భుతమైన చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కాశ్మీర్, లడఖ్ మధ్య దశాబ్దాల నాటి సర్వకాలీన అనుసంధానత కల నెరవేరింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాలను కలిపే అత్యంత ప్రతిష్టాత్మక 'జోజిలా టన్నెల్' (Zojila Tunnel) ప్రాజెక్ట్ ఫైనల్ బ్రేక్ త్రూను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించారు. దేశ రక్షణ రంగంతో పాటు పౌర రవాణాలో సరికొత్త విప్లవానికి ఈ ప్రాజెక్ట్ వేదికగా నిలిచింది.

భారతదేశ మౌలిక సదుపాయాల రంగంలో ఒక అద్భుతమైన చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కాశ్మీర్, లడఖ్ మధ్య దశాబ్దాల నాటి సర్వకాలీన అనుసంధానత కల నెరవేరింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాలను కలిపే అత్యంత ప్రతిష్టాత్మక 'జోజిలా టన్నెల్' (Zojila Tunnel) ప్రాజెక్ట్ ఫైనల్ బ్రేక్ త్రూను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించారు. దేశ రక్షణ రంగంతో పాటు పౌర రవాణాలో సరికొత్త విప్లవానికి ఈ ప్రాజెక్ట్ వేదికగా నిలిచింది.

సముద్ర మట్టానికి ఏకంగా 11,578 అడుగుల అసాధారణ ఎత్తులో నిర్మించిన ఈ సొరంగం.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న 'అతి పొడవైన సింగిల్‌ట్యూబ్ బైడైరెక్షనల్' టన్నెల్‌గా సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ ప్రధాన సొరంగం పొడవు 13.153 కిలోమీటర్లు కాగా, అప్రోచ్ రోడ్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో కలిపి మొత్తం ప్రాజెక్ట్ పొడవు 30.894 కిలోమీటర్లుగా ఉంది. వెర్టికల్ షాఫ్ట్‌లు, నిల్‌గ్రార్ జంట సొరంగాలు, మంచు తాకిడిని తట్టుకునే 'స్నో గ్యాలరీలు' ఈ ప్రాజెక్ట్‌లో కీలక నిర్మాణాలుగా నిలిచాయి.

గతంలో శీతాకాలంలో సంభవించే భారీ మంచు తుఫానులు, కొండచరియలు విరిగిపడటం వల్ల జోజిలా పాస్ పూర్తిగా మూసుకుపోయేది. ఫలితంగా లడఖ్ ప్రాంతం ఏటా దాదాపు ఆరు నెలల పాటు దేశంలోని మిగతా భాగాలతో సంబంధాలు తెగిపోయి బాహ్య ప్రపంచంతో కట్ అయిపోయేది. ఇకపై ఈ జోజిలా టన్నెల్ ద్వారా శ్రీనగర్ - లడఖ్ మధ్య ఏడాదిలో 365 రోజులూ నిరంతరాయంగా, సురక్షితంగా రాకపోకలు సాగించడం సాధ్యమవుతుంది.

చైనా, పాకిస్థాన్ సరిహద్దులకు ఆనుకుని ఉండే ద్రాస్, కార్గిల్, లేహ్ వంటి వ్యూహాత్మక, సున్నితమైన సరిహద్దు ప్రాంతాలకు ఈ టన్నెల్ ఒక రక్షణ కవచంలా మారనుంది. శీతాకాలంలో కూడా భారత సైన్యాన్ని, భారీ యుద్ధ సామాగ్రిని, లాజిస్టిక్స్ సామగ్రిని ఎలాంటి ఆటంకాలు లేకుండా సరిహద్దులకు తరలించడానికి ఇది సైన్యానికి ఎంతో కీలకంగా మారనుంది.

**మేఘా ఇంజనీరింగ్ అంకితభావం..**

**అధిగమించిన సవాళ్లు**

నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NHIDCL) పర్యవేక్షణలో.. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ మౌలిక వసతుల సంస్థ 'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్' (MEIL) ఈ అత్యంత క్లిష్టమైన ప్రాజెక్ట్‌ను చేపట్టింది. 'న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్' (NATM) అనే అత్యాధునిక సాంకేతికతతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ టన్నెల్ నిర్మాణ కాలంలో ప్రకృతి సృష్టించిన సవాళ్లు అన్నీ ఇన్నీ కావు.

మైనస్ 20 డిగ్రీల గడ్డకట్టే ఉష్ణోగ్రతల్లో సైతం 1200 మందికి పైగా కార్మికులు ఆధునిక పరికరాలతో రాత్రింబగళ్లు శ్రమించారు. గత ఐదేళ్లలో ఈ ప్రాంతంలో 5 భారీ హిమపాతాలు సంభవించినా మేఘా సంస్థ వెనుకడుగు వేయలేదు. మూడేళ్ల కిందట భారీ హిమపాతంలో చిక్కుకున్న 172 మంది కార్మికులను భారత సైన్యం ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించింది. టన్నెల్ తవ్వే మార్గంలో రాతి పొరల స్వభావం ఏకంగా 67 సార్లు మారినా, ఇంజనీర్లు పట్టుదలతో అధిగమించారు.

**అమర్‌నాథ్ యాత్రికులకు వసతులు**

ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడం వల్ల లడఖ్ ప్రాంతంలో పర్యాటక రంగం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు అపూర్వమైన రీతిలో ఊపందుకోనున్నాయి. స్థానిక ప్రజల దశాబ్దాల నాటి రవాణా కష్టాలు శాశ్వతంగా తీరిపోనున్నాయి. వీటితో పాటు అమర్‌నాథ్ యాత్రికుల సౌకర్యార్థం ఈ మార్గంలో ప్రత్యేక పార్కింగ్ ప్లేస్‌లు, అత్యవసర వైద్య సదుపాయాలు అధునాతన మౌలిక వసతులను కూడా కల్పించారు.

ఇది కేవలం ఒక రహదారి లేదా సొరంగం మాత్రమే కాదు, అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులను సవాల్ చేస్తూ భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి, దేశ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఒక అద్భుత కట్టడం అని నిపుణులు కొనియాడుతున్నారు...

# హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో

- **ఆరోపణలకు, విమర్శలకు ఆస్కారమివ్వొద్దు**

**ఆశ్వి అప్డేట్స్ ఏపీ బ్యూరో ప్రతినిధి**

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విద్యార్థులు వచ్చేనాటికి హాస్టళను, గురుకులాలను శుభ్రం చేయండి* బీసీ బిడ్డల ఉన్నత విద్యే కూటమి లక్ష్యం

* రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాల ఏర్పాటు* ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచండి బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షలో మంత్రి సవిత : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచాలని, చేనేతలకు, హస్త కళాకారులకు రోజూ ఉపాధి కల్పించాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్ లో బీసీ సంక్షేమ, ఆప్కో, లేపాక్షి అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపడుతున్నఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మాట్లాడుతూ, కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో చేరేలోగా, తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లు, గురుకుల్లాల్లో చేరే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో అత్యధిక మంది విద్యార్థులను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఐఐటీ, నీట్ కు ఉచిత శిక్షణ అందజేయనున్నామన్నారు. విశాఖ, టేకులోడు ఎంజేపీ స్కూళ్లలో రెండు ఉచిత నీట్, ఐఐటీ



శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

ఆరోపణలకు ఆస్కారమివ్వొద్దుగతేడాది బీసీ హాస్టళ్ల వార్డెన్లపై విపరీతమైన ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఇది క్షమించరాని నేరమన్నారు. భవిష్యత్తులో బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై ఎటువంటి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపాళ్ల చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. హాస్టళ్లు, గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల సంస్థల నేపథ్యంలో వార్డెన్లు, ఎంజేపీ గురుకులాల ప్రిన్సిపాల్లు అమరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్షాలు సైతం హాస్టళ్లను, గురుకులాలను సందర్శించి నిర్వహణ బాగోలేదంటూ మీడియాకు లికేజీ ఇచ్చ ప్రమాదముందని హెచ్చరించారు. త్వరలో మెస్ ఛార్జీలు పెంచనున్నామని, బాధ్యతాయుతంగా మెలగాలని వార్డెన్లు, ప్రిన్సిపాళ్ల కు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

అనంతరం చేనేత, హస్త కళల అధికారులతో మంత్రి సవిత కీలక భేటీ నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఎన్ని ఆప్కో, లేపాక్షి షో రూమ్ లున్నాయన్నారు. ఆయా షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచేలా చర్యలు తీసువాలని ఆదేశించారు. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణకు తరంగా అనే యాప్ అనే ఆధారాత వ్యవస్థను సిద్ధం చేశామ్నారు. ఏనాటి అమ్మకాలను ఆనాడే ఈనాటి నుంచే చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.



# పద్మనాభునిపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

- **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
- **సర్పంచ్ వేముల అరుణ రాజేశం**

**ఆశ్వి అప్డేట్స్, దుబ్బాక :**

దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ రవి, సర్పంచ్ వేముల అరుణ రాజేశం ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, సిద్దిపేట్ వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పలువురికి నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేముల అరుణ రాజేశం మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామంలో ఆర్ఎంపీగా సేవలు అందిస్తూ సైదుగారి రవిని గ్రామస్తులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ రుద్రారం యాదగిరి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

- **ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి**

**జగదేవపూర్ , ఆశ్విఅప్డేట్స్**

వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్ గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పెంచిన మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. నర్సరీలో ఉన్న మొక్కలను వేరుచేసి నాటేందుకు సిద్ధం చేయాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలోని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వానకాలం ప్రారంభమైంది కాబట్టి గ్రామాలు పారిశుద్ధ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా, కార్యదర్శి నరేష్ రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మకు 45 రకాల ప్రసాదాల సమర్పణ

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

కుకునూరుపల్లి మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అధిక జ్యేష్ట మాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకొని, లోక కళ్యాణార్థం మహిళలు సామూహిక 'అధిక వాయనం' సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు ఒక్కో రకానికి 33 చొప్పున.. మొత్తం 45 రకాల వివిధ ప్రసాదాలు, పండ్లు, స్వీట్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మహిళా సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# అనుమతి లేని ఫ్లెక్సీలు హోర్డింగులకు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

**గజ్వేల్ జున్ 9, (ఆశ్వి అప్డేట్స్)**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు, వాణిజ్య సముదాయ వ్యాపారులకు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమానులకు, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు మరియు ప్రింటింగ్ ప్రెస్ యాజమానుదారులకు తెలియజేయునది... ఏమనగా పట్టణ పరిధిలో గల రోడ్డుకు ఇరువైపుల గాని, రోడ్డు డివైడర్ లో గాని మరియు భవనాల పైన గాని వాణిజ్య ప్రకటనలకు సంబంధించిన పోస్టర్స్ గాని, ఫ్లెక్సీలు గాని మరియు హోర్డింగులకు సంబంధించి కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వబడలేదు. ఒకవేళ వాణిజ్య ప్రకటనలు చేయదలచిన వారు ముందస్తుగా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి అనుమతి పొందిన తర్వాతే పెట్టుకోవలయును. లేనియెడల మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలుపనైనది.





# లెహ్ సెక్టార్‌ను సందర్శించిన.. భారత రక్షణ శాఖ కార్యదర్శి..


**ఆశ్వి అప్డేట్స్**

భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ 14వ కోర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

లెహ్ సెక్టార్‌ను సందర్శించారు. తూర్పు లడఖ్, బేస్ క్యాంప్, నార్తర్న్ గ్లేసియర్ లాంటి సరిహద్దు ప్రాంతాలను సందర్శించారు. ఫార్వర్డ్ ఏరియాల్లో సైనికులతో స్వయంగా ముచ్చటించి, వారి సన్నద్ధతను పరిశీలించారు...

# 'పెద్ది' వివాదం.. గిరిజనుల నిరసన!

**ఆశ్వి అప్డేట్స్**



హీరో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలోని ఓ సంభాషణ గిరిజన జాతిని కించపరిచేలా ఉందని విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు.

'కొండనా కొడకా' అనే పదం అభ్యంతరకరమని, ఇది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి విరుద్ధమని వారు ఆరోపించారు.

ఈ అసభ్య పదజాలాన్ని వెంటనే తొలగించాలని.. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు డిమాండ్ చేశారు. సెన్సార్ బోర్డు తీరుపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు.




# అప్పక్ పల్లి కోటకొండకోయిలకొండ రోడ్డు అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలి

- **బి. రాము ,జిల్లా కార్యదర్శి సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ డిమాండ్**
- **కె. కాశీనాథ్ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి డిమాండ్**
- **15న పాదయాత్ర, 16న మహా ధర్నా రాస్తారోకో, 17 రాస్తారోకో**

**ఆశ్వి అప్డేట్ :**
**నారాయణపేట జూన్ 9**

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయం (భగత్సింగ్ భవన్) లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి రాము, డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజకవర్గ రోడ్లు ఎందుకు అసంపూర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారు. నారాయణపేట నియోజకవర్గం ప్రజలకు హామీ ఇచ్చారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉంది అని అన్నారు.

# ఫనాటెక్ ప్రీమియం సిమ్ రేసింగ్ హార్డ్వేర్ ను ప్రారంభిస్తున్న నటి చాంధిని భగవనాని

- **విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్యంతో భారత్ లోకి ఫనాటెక్**

**ఆశ్వి అప్డేట్స్ సికింద్రాబాద్, జూన్ 9 :**

ప్రీమియం సామ్ రేసింగ్ హార్డ్వేర్ లో గ్లోబల్ లీడర్ అయిన ఫనాటెక్ విశాల్ పెరిఫెరల్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారత మార్కెట్లోని అడుగు పెట్టింది. మంగళవారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని విశాల్ కంప్యూటర్స్ లో నటి చాందిని భగవనాని ఫనాటెక్ సామ్ రేసింగ్ హార్డ్ వేర్ ను ఆవిష్కరించారు. భారత దేశంలో గేమింగ్ ప్రియులు, ఈ స్పోర్స్ ప్లేయర్లు రేసింగ్ ప్రొఫెషనల్స్ కు అధిక పనితీరు గల సిమ్ రేసింగ్ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా విశాల్ పెరిఫరల్స్ ఎండీ వికాస్ పాసారియా మాట్లాడుతూ..... భారత్ లో ఇమ్మర్సిన్ గేమింగ్ కు పెరుగుతున్న డిమాండ్ కు ఫనాటెక్ ఉత్పత్తులు సరిపోతాయని తెలిపారు.



# ఇంగువ.. రోజుకో చిటికెడు చాలు







ఆయుర్వేదంలో ఇంగువకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా భారతీయ వంటకాల్లో ఇంగువను విరివిగా ఉపయోగిస్తారు. ఇది వంటకాలకు ప్రత్యేకమైన రుచి, సువాసన ఇవ్వడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీర్ణ సమస్యలకు సహాయపడటంతో పాటు శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం, రక్తపోటు అదుపులో ఉంటుందంటున్నారు నిపుణులు. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో సమృద్ధమైన ఇంగువ నొప్పులను కూడా తగ్గిస్తుంది. అంతేకాక ఇంగువ సాధారణంగా సురక్షితమైనదే. కానీ, కొంతమందిలో కొన్ని దుష్ప్రభావాలు కనిపించవచ్చనని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా అధిక మోతాదులో తీసుకుంటే లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నష్టాలు ఎక్కువగా కనిపిస్తాయని చెబుతున్నారు.

**ఎలా తయారు చేస్తారో తెలుసా**

ఇంగువను ఫెరులా జాతికి చెందిన మొక్కల కాండం, వేర్ల నుంచి ప్రవించే జిగురు నుంచి తయారు చేస్తారు. ఈ మొక్కలు ప్రధానంగా ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్తాన్ వంటి మధ్య ఆసియా దేశాల ఎడారి ప్రాంతాల్లో పెరుగుతాయి. ఇది మొక్క కాండం లేదా వేరు భాగాన్ని కోసి వచ్చిన జిగురు లాంటి ద్రవాన్ని సేకరిస్తారు. అలా సేకరించిన జిగురును గాలికి ఎండపెట్టితే అది చిన్న రాళ్లలా మారుతుంది. ఇలా గడ్డగట్టిన ఇంగువ రాళ్లను మెత్తడి పొడిగా మారుస్తారు. కొన్నిసార్లు దీనికి బియ్యం పిండి లేదా ఇతర పదార్థాలను కలుపుతారు. ఇలా చేయడం వల్ల ఉపయోగించడానికి సులభం అవ్వడంతో పాటు ఎలా కాలం నిల్వ ఉంటుంది. అంతే కాకుండా ఘాటైన వాసనను తగ్గిస్తుంది.

**కడుపు నొప్పి:** ఇంగువలో ఉండే ఔషధ గుణాలు కడుపుబ్బరం సమస్యకు విరుగుడుగా పనిచేస్తాయి. చాలాసార్లు కడుపునొప్పికి కారణం గ్యాస్, కడుపుబ్బరం సమస్యలే. కాబట్టి, చిటికెడంత ఇంగువను పరగడుపున తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాక కడుపు నొప్పి తో పాటు వికారం, వాంతులు, అతిసారం వంటి సమస్యలు తలెత్తవచ్చనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరిలో తలనొప్పి లేదా మైకం వచ్చినట్టు అనిపించవచ్చు. బీపీ కంట్రోల్ : ఇంగువ శరీరంలో బ్లడ్ క్లాట్స్‌ను నివారిస్తుంది. రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. రోజూ పొద్దునే ఇంగువ కలిపిన నీళ్లు తాగితే రక్తపోటు నియంత్రణలో సహాయకారిగా ఉంటుంది. ఇంగువ రక్తపోటును తగ్గించే గుణాలు కలిగి ఉంటుందని అనేక అధ్యయనాల్లో తేలింది. కానీ తక్కువ రక్తపోటు ఉన్నవారు లేదా రక్తపోటును తగ్గించే మందులు వాడుతున్నవారు దీన్ని ఉపయోగించే ముందు సంబంధింత డాక్టర్లు సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా కొందరికి దీని వల్ల పెదవులు, ముఖం లేదా నాలుక వాపు వంటి అలెర్జీ వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

**తలనొప్పి:** పరగడుపునే ఇంగువ తీసుకోవడం వల్ల తలనొప్పి బాధ నుంచి విముక్తి లభిస్తుంది. ఇంగువలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు తలనొప్పి చికిత్సలో ఉపకరిస్తాయి. కాకపోతే, ఆయుర్వేదం లేదా అలోపతి ఏ విధానంలో అయినా దీన్ని ప్రత్యేక అవసరాల కోసం వాడినప్పుడు డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే తీసుకోవడం మంచిది. ఇంగువ రక్తం పలుచబడటానికి దోహదం చేస్తుంది కాబట్టి రక్త సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా శస్త్రచికిత్సకు సిద్ధమవుతున్నవారు దీనిని తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.

**మధుమేహం :** ఇందులో టానిన్లు, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను దెబ్బతినకుండా రక్షించడంలో సహాయపడడంతో పాటు దీర్ఘకాలిక మంట, గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధులను నివారిస్తుందంటున్నారు నిపుణులు. ఇంగువ ప్రాథమిక పరీక్షల్లో వంధ్యత్వం, మధుమేహ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య ప్రభావాలను ప్రదర్శించిందని చెబుతున్నారు. అంతేకాక మూర్ఛ లేదా ఇతర కేంద్ర నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు ఉన్నవారు ఇంగువను నివారించాలని, ఎందుకంటే ఇది ఆ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుందని నిపుణులు తెలిపారు. గర్భిణి, బాలింతలు : గర్భిణులు, పాలిచ్చే వారు ఇంగువను అధికంగా తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిశువులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని వివరించారు.

# కంటి నిండా నిద్ర కావాలా?

మన జీవితంలో దాదాపు సగం కాలాన్ని నిద్రలోనే గడుపుతాం. ఆరోగ్యానికిది ఎంతో అవసరం. సరిగా నిద్ర పట్టకపోతే చిరాకు, అలసట, విచారం కలుగుతాయి. శారీరక స్పందనల వేగమూ తగ్గుతుంది. తలనొప్పి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలెన్నో చుట్టుముడతాయి. దీర్ఘకాలంగా తగినంత నిద్ర పట్టకపోతే నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది. మనలో చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతుంటారు. మంచం ఎక్కి చాలాసేపైనా సరే.. నిద్ర రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు.



**నిద్రకు టైం సెట్**

రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం వల్ల నిద్ర పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే పడుకునే ముందు టీవీ చూడటం, సెల్‌ఫోన్, కంప్యూటర్ వంటి గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. వీలైతే గోరువెచ్చని నీటితో స్నానం చేయడం, గోరువెచ్చటి పాలు తాగడం.. వంటి అలవాట్ల వల్ల కూడా చక్కటి ఫలితాలు ఉంటాయని వివరిస్తున్నారు. అంతేకాక పగటి పూట ఏదో కాసేపు కునుకు తీస్తే ఇబ్బందేమీ ఉండదు. కానీ ఎక్కువసేపు పడుకుంటే రాత్రి పూట నిద్ర అవసరం తగ్గుతుంది. ఒంట్లో జీవ గడియారమూ గతి తప్పుతుంది. దీంతో పగటి పూట చురుకుగా, రాత్రి పూట నిద్ర వచ్చే ప్రక్రియ అస్తవ్యస్త మవుతుంది. కాబట్టి నిద్ర సమస్యలతో బాధపడేవారు పగటి నిద్రను మానేస్తే మంచిది.

**లేట్ నైట్ వర్క్..**

రోజంతా పనిచేయటానికి మనమేమీ యంత్రాలం కాదు. పనులతో సతమతమైన మనసుకు, కండరాలకు రెస్ట్ తప్పనిసరి. అప్పటి వరకూ మనల్ని చురుకుగా ఉంచిన అడ్రినలిన్ హార్మోన్ మోతాదులు తగ్గుముఖం పట్టేలా చూసుకోవాలి. అంటే పడుకోవటానికి కొద్ది గంటల ముందే శరీరాన్ని నిద్రకు సన్నద్ధం చేయాలన్నమాట. అందువల్ల ఏ పనీ పెట్టుకోవద్దు. ఆఫీసు రిపోర్టుల వంటివి ముందేసుకొని మేలుకోవద్దు. ఇష్టమైన పుస్తకం చదవటం, శ్రావ్యమైన సంగీతాన్ని వినటం, ధ్యానం చేయటం వంటి మనసుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి. షిఫ్ట్ ఉద్యోగులు, తరచూ రాత్రిపూట ఆలస్యంగా పడుకునేవారిలో నిద్ర సమస్యలు తలెత్తటానికి ప్రధాన కారణం వేళకు నిద్ర పోకపోవటం. కాబట్టి రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం చాలా ముఖ్యం. దీంతో నిద్ర వేళలు నియమబద్ధం అవుతాయి.



**ఒత్తిడికి దూరంగా!**

మన రోజువారీ జీవితంలో ఎదుర్కొన్న ఒత్తిడి, ఆందోళన వంటివి కూడా రాత్రి పూట నిద్ర పట్టకుండా చేస్తాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఇంట్లో, ఆఫీసులో ఉండే పలు సమస్యలు, ప్రసవం గురించిన భయాలు నిద్రలేమికి దారితీస్తాయని చెబుతున్నారు. దీనివల్ల మీతో పాటు కడుపులో పెరుగుతున్న మీ బిడ్డకు మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఎక్కువగా ఆలోచించకుండా ఒత్తిడిని దూరం చేసుకొని హాయిగా నిద్రపోవాలని పేర్కొన్నారు. అలాగే పడుకోవడానికి కనీసం గంట ముందు తల, కాళ్లను సున్నితంగా మసాజ్ చేసుకోవాలని నిపుణలు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నరాలు ఉత్తేజితమై హాయిగా నిద్ర పడుతుందని అంటున్నారు నిపుణులు.

**లేట్ గా డిన్నర్ చేయడం..**

రాత్రిపూట ఆలస్యంగా పీకల దాకా భోజనం చేయటం, జీర్ణం కాని పదార్థాలు తినటం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత పెరుగుతాయి. ఇవి నిద్రను దెబ్బతీస్తాయి. కాబట్టి పడుకోవటానికి మూడు గంటల ముందే భోజనం ముగించెయ్యాలి. కొవ్వు పదార్థాలకు బదులు తేలికగా జీర్ణమయ్యేవి తినాలి. అంతేకాక శారీరక శ్రమ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుంది. కాబట్టి రోజూ ఉదయాన్నే వ్యాయామం చేయటం ఉత్తమం. ఆరుబయట నడక, పరుగు, సైకిల్ తొక్కటం వంటివి చేస్తే స్వచ్ఛమైన గాలికి మనసు, శరీరం ఉత్సాహంతో తొణికిసలాడతాయి. రాత్రిపూట గాఢంగానూ నిద్ర పడుతుంది.



**టీ, కాఫీ వల్ల కూడా..**

సాయంత్రం వేళల్లో కాఫీ, టీ ఎక్కువగా తాగేవారికి రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కూల్ డ్రింకులు, రెడ్ వైన్, చాక్లెట్లు, ఛీజ్ వంటివీ నిద్రకు చేటు చేస్తాయి.



# మౌత్ వాష్ సరిగ్గా ఉందా?

**ముఖ అందంపై దృష్టిపెట్టినా కొందరు నోటి శుభ్రతను అశ్రద్ధ చేస్తారు. ఇది చిగుళ్ల నొప్పులు, పళ్లు సమస్యలకు దారితీయొచ్చు. అంతేకాక చిగురు ఉబ్బితే కీళ్ల నొప్పి తలెత్తడమేంటి? ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమే. రెండూ వేర్వేరే అయినా చిగుళ్లు, కీళ్ల మధ్య అవినాభావ సంబంధం ఉంటోందని.. ఒకటి జబ్బు పడితే మరోటీ అదే దారిలో నడుస్తోందని పరిశోధనలు చెబుతున్నాయి. చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుకుంటే కీళ్లవాతం వచ్చే స్వభావం ఉన్నా జబ్బుగా మారకుండా చూసుకోవచ్చని అనుభవాలు చెబుతున్నారు.**

చిగుళ్ల జబ్బు (పెరియోడాంటల్ డిసీజ్ తరచూ చూసేదే. నోటిని సరిగా శుభ్ర చేసుకోకపోవటంతో చిగుళ్లు ఉబ్బటం నొప్పి, రక్తం రావటం వంటి వాటితో చాలామంది ఇబ్బంది పడుతుంటార మనం తినే ఆహార పదార్థాల ముక్క పళ్లు మధ్యలో చిక్కుకు పోతుంటాయి సరిగా శుభ్రం చేసుకోకపోతే అక్క బ్యాక్టీరియా పెరిగి, పొరలా ఏర్పడు తుంద ఇది చిగుళ్లకు, పళ్లలకు గట్టిగా అతుక్కుపోతుంది. పొగ తాగటం, పా గుట్కా నమలటం వల్ల దంతాల మీద ప మచ్చలూ ప్రమాదమే. వీటిల్లోనూ రకరకా బ్యాక్టీరియా చిక్కుకొని వృద్ధి చెందుతాయి చిగుళ్లను చికాకు పరుస్తాయి. గారలో బ్యాక్టీరియా ఆమ్లాలను, విషతుల్యాలను ఉత్ప చేస్తుంది. ఇవి చిగుళ్లను దెబ్బతీసి ఇన్ఫెక్షన్ కారణమవుతాయి. తొలిదశలో.. అంటే ఇన్ఫెక్ష చిగురుకే పరిమితమైతే (జింజివైటిస్) వా ఎరుపు, నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప తోముకుంటున్నప్పుడు చిగుళ్లనుంచి రక్తం రావొచ్చు నోటి దుర్వాసనా తలెత్తొచ్చు. తగు చికిత్స తీసుకోకపో సమస్య తీవ్రమై పెరియోడాంటైటిస్ తలెత్తుతుంది. ఇ క్రమంగా దవడ ఎముకకూ విస్తరించొచ్చు. చిగుళ్లక దంతాలకు మధ్య ఖాళీలు ఏర్పడొచ్చు. దీంతో పళ్లు పట్టు సడ చివరికి ఊడిపోతాయి.

### గుండెజబ్బుకూ లింక్

చిగుళ్లజబ్బు అక్కడికే పరిమితమని అనుకోవటానికి లేదు. చిగుళ్ల ఇన్ఫెక్షన్కూ గుండెజబ్బుక సంబంధం ఉంటున్నట్టు ఇప్పటికే స్పష్టమైంది. మధుమేహం, అల్సర్లు, కిడ్నీ జబ్బుల వంటి వాటి ఉద్ధృతం చేస్తున్నట్టు బయటపడింది. ఇది కీళ్లనూ వదలటం లేదు. వయసు మీద పడటం వ తలెత్తే మామూలు కీళ్ల నొప్పుల్లోనే కాదు.. మన రోగనిరోధక శక్తి మన మీదే దాడి చేయటం వ తలెత్తే కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్) సమస్యలు వస్తున్నాయి. అంతేకాక చిగు జబ్బు, కీళ్లనొప్పులు రెండూ వాపు ప్రక్రియతో ముడిపడినవే. వీటిల్లో శరీర రోగనిరోధక వ్యవ కీలక పాత్ర పోషిస్తుంది.

### నింపుల్ టిక్స్ తో ..

**తరచూ దంత వైద్యుడిని సంప్రదించి పరీక్షించుకోవాలి. కీళ్లనొప్పులు గలవారికిది మరింత ముఖ్యం.**
**చిగుళ్ల జబ్బును త్వరగా గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది.**
**రాత్రి పడుకునే ముందు, ఉదయం నిద్ర లేచాక.. రోజుకు రెండుసార్లు బ్రష్తో పళ్లను తోముకోవాలి.**
**రాత్రిపూట సన్నటి దారంతో పళ్ల మధ్య చిక్కుకున్న శుభ్రం చేసుకోవాలి.**
**ప్రతి ఆర్నెల్లకో, ఏడాదికో నిపుణులతో పళ్లను శుభ్రం చేయించుకోవాలి.**
**పళ్లు తోముకుంటున్నప్పుడు రక్తం వస్తుంటే నిర్లక్ష్యం చేయరాదు.**
**నొప్పి, ఉబ్బు కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలి.**



**ఉసిరి:** ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ నుంచి బయటపడటానికి సాయపడతాయి. దీన్ని పచ్చిగా తిన్నా, ఎండువి నమిలినా సరే... చిగుళ్ల ఆరోగ్యం బాగుంటుంది. నోటి దుర్వాసన అదుపులో ఉంటుంది.

**వేప:** దీన్ని సర్వరోగ నివారిణిగా చెబుతారు. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు క్యావిటీలకు కారణమయ్యే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. రోజూ వేప ఆకులను ముద్దగా నూరి రుద్దినా, వేప చిగుళ్లను నమిలినా సరే... దంత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

**బేకింగ్ సోడా:** దీనికి ఆల్కలైన్ గుణాలెక్కువ. ఇది నోట్లోని యాసిడ్లను తటస్థం చేస్తుంది. బేకింగ్ సోడా యాంటీ మైక్రోబియల్ ఏజెంట్. దీనికి సూక్ష్మక్రిములను దూరం చేసి గారపట్టిన పళ్లను తెల్లగా మార్చే శక్తి ఉంది. అయితే, రోజూ దీన్ని వాడకూడదు. వారానికోసారి బ్రష్పై వేసి రుద్దితే సరి.



**స్ట్రాబెర్రీ:** ఈ పండ్లలోని మాలిక్ యాసిడ్... దంతాలను మిలమిలా మెరిపిస్తుంది. డీహైడ్రేషన్ వల్ల ఎదురయ్యే నోటి దుర్వాసన అదుపులో ఉంటుంది. విటమిన్ సి నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.



# ఇండియన్ బ్లాక్బెర్రీతో
## బోలెడు ప్రయోజనాలు

ఈ సీజన్ ఫుట్... ఇప్పుడు మార్కెట్లో ఎక్కడ చూసినా అల్ల నేరేడు పండ్లు కనిపిస్తున్నాయి. నల్లగా నిగ నిగ లాడుతూ నోరు ఊరిస్తున్నాయి. ఏ సీజన్లో వచ్చే పండ్లను ఆ సీజన్లో తినడం అలవాటు చేసు కోవాలని పెద్దలు చెబుతారు. తీపి, పులుపు కలయితో గమ్మత్తుగా ఉంటుంది ఈ నేరేడు పండు. నేరేడు ఆకులు, బెరడును కూడా ఔషధాల తయారీలో వాడతారు. ఇండియన్ బ్లాక్బెర్రీ, జామూన్, లేదా జావా ప్లం ఈ పేరుతో పిలుస్తాం. అల్ల నేరేడు పోషకాల గని. ఆరోగ్యకరమైన కొవ్వుల సమ్మేళనం. ఆంథోసైనిన్లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్తో సహా యాంటీఆక్సిడెంట్లు మెండు. ఇంకా ప్రొటీన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, విటమిన్ సీ, థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బీ6, విటమిన్ ఏ, పుష్కలంగా లభిస్తాయి. నేరేడు పండు మాత్రమే కాదు, గింజల్ని ఔషధాలుగా వాడతారు. షుగర్ కంట్రోల్ చేయడంతో పాటు ఇతర బెనిఫిట్స్ అందిస్తున్నాయి. అనారోగ్య సమస్యలను దరిచేరనీయకుండా.. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతున్నాయి. ఈ పండులో జాంబోలిన్ అనే సమ్మేళనం పిండి పదార్థాన్ని చక్కెరగా మార్చడాన్ని నిరోధించడం ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వీటిల్లోని యాంటాక్సిడెంట్ల సమ్మేళనాలు, విటమిన్ సీ చర్మంలో కొలాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. ఫలితంగా చర్మం మెరుస్తుంది. అంతేకాదు చాలాకాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు విసర్జిస్తుంది. పేగుల్లో చుట్టుకు పోయిన వెంట్రుకలకు కోసేసి బయటికి పంపే శక్తి నేరేడు పళ్ళకు ఉందని పెద్దలు చెబుతారు.

పిండిపదార్థం, కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. కనుక అధిక బరువు ఉన్నవారు కూడా తినవచ్చు. ఇందులోని అంతేకాదు ఫైబర్ కంటెంట్ సరైన జీర్ణక్రియకు దోహదపడి, అనవసరమైన కొవ్వు పెరగకుండా అడ్డుపడుతుంది.

**జీర్ణక్రియ మెరుగుదల:** నేరేడు పళ్లలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకం, ఇతర జీర్ణ సమస్యలను నివారిస్తుంది.


**రోగనిరోధక శక్తి పెంపు:** విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్లు, జలుబు నుంచి రక్షిస్తాయి. రకాల ఇన్ఫెక్షన్లు దరి చేరకుండా అడ్డుకుంటాయి.

**చర్మ ఆరోగ్యం:** నేరేడు పళ్లలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. ముఖ్యంగా మొటిమలు, వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి.

**గుండె ఆరోగ్యం:** పొటాషియం మరియు మెగ్నీషియం వంటి ఖనిజాలు రక్తపోటును నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

**రక్తహీనత నివారణ:** నేరేడు పళ్లలో ఉన్న ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది మరియు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది.

**నోటి ఆరోగ్యం:** నేరేడు పళ్లు, వాటి ఆకులు చిగుళ్ల రక్తస్రావం, పళ్ల సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి



# ఇకపై అలాంటి పాత్రలను మాత్రమే ఎంచుకోవాలనుకుంటున్నా..



కన్నప్ప సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్న ప్రీతి ముకుందన్.. ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయారు. ఇటీవల బ్లాస్ట్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ ఇప్పుడు వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రీతి, తను నటిస్తున్న చిత్రాలు, పాత్రల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినిమాల ఎంపిక గురించి ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. "నేను ఎంచుకుంటున్న కథలు చాలా కొత్తగా ఉంటున్నాయి. ఒకేలాంటి పాత్రలు కాకుండా ప్రతి మూవీలోనూ వైవిధ్యం ఉండేలా చూసుకుంటున్నాను. 'ఇదయం మురళి' చిత్రంలో నేను ఒక పద్ధతైన సంప్రదాయ హీరోయిన్ పాత్రలో కనిపిస్తుండగా, 'దశమకన్' సినిమాలో మాత్రం చాలా అమాయకపు యువతిగా నటిస్తున్నాను.

అలాగే పాపులర్ యాక్టర్ అశోక్ సెల్వన్ కాంబినేషన్‌లో చేస్తున్న మరో సినిమాలో, నేను భావోద్వేగాలతో కూడిన, చాలా మెచ్యూర్డ్ పాత్రను పోషిస్తున్నాను. వీటితో పాటు హిందీ చిత్రాల్లో కూడా నటించాలని నాకు చాలా ఆశగా ఉంది" అని చెప్పారు. తన కెరీర్ ప్లానింగ్ గురించి వివరిస్తూ.. "ప్రస్తుతం నేను కాస్త నెమ్మదించి, నా సినిమాలు ప్రేక్షకులకు ఎలా నచ్చుతున్నాయో గమనిస్తున్నాను. నా నటనను నేనే అంచనా వేసుకుని, ఆ తర్వాతే మరిన్ని కొత్త ప్రాజెక్టులను ఓకే చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది నావి కనీసం 5 నుండి 6 చిత్రాలు విడుదలవుతాయని ఆశిస్తున్నాను. సాధారణంగా ప్రేక్షకులు నన్ను గ్లామరస్ కమర్షియల్ హీరోయిన్ పాత్రల్లో చూడాలని కోరుకుంటారు. కానీ నేను మాత్రం ప్రస్తుతం అస్సలు వదులుకోకూడని అద్భుతమైన కథలను మాత్రమే ఎంచుకోవాలని ఫిక్స్ అయ్యాను" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 'మకుటం' టీజర్ అప్డేట్ ఇచ్చిన విశాల్..

కోలీవుడ్ హీరో విశాల్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ.. ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారారు. 'మకుటం' సినిమాలో ప్రధాన పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వం బాధ్యతలు కూడా తీసుకున్నాడు. తమిళంలో 'మగుడం' పేరుతో రాబోతుంది. ఆర్ బి చౌదరి సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. విశాల్ సరసన దుషారా విజయన్, అంజలి హీరోయిన్లుగా నటిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మకుటం' చిత్రం పూర్తిగా సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక పవర్‌ఫుల్ మాఫియా, క్రైమ్ డ్రామా అని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన టీజర్ రాబోతున్నట్లు విశాల్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "చివరికి, దర్శకుడిగా నా అధికారిక అరంగేట్రం జరుగుతోంది. ఈ కల నిజం కావాలని నేను గత 30 ఏళ్లకు పైగా ఎంతో ఆశతో, ఆరాటంతో ఎదురుచూశాను. మకుటంతో కల నిజం కాబోతోంది. మేము ఎంతో శ్రద్ధగా, ఇష్టపడి రూపొందించిన ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురాబోతున్నందుకు చాలా ఉత్సాహంగా ఉంది. జూన్ 10న 'మకుటం' టీజర్‌ను మీ ముందుకు తీసుకువస్తున్నాం. మాపై దేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలి" అని ఎమోషనల్ అయ్యారు.





## రిలీజ్‌కు సిద్ధమైన 'కొరియన్ కనకరాజు'!

మెగా హీరో వరుణ్ తేజ్ హిట్ కోసం గత కొద్ది కాలంగా సమమతమవుతున్నాడు. వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ బాక్సాఫీసు వద్ద ఆశినంత స్థాయిలో విజయాన్ని దక్కించుకోలేకపోతున్నాయి. అయినప్పటికీ ఆయన ఏ మాత్రం నిరాశ చెందకుండా వరుస ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తున్నాడు. ప్రస్తుతం వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. ఇందులో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు యూవి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే కొంతశాతం పూర్తి కాగా.. విడుదలైన టీజన్, ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను సొంతం చేసుకున్నాయి. ఇక ఇప్పుడు షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా? అని అంతా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని ఈ ఏడాది ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్.అంతేకాకుండా జూన్ మూడో వారంలో స్పెషల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఆ కఠిన సమయంలో నాకు అండగా నిలిచింది వాళ్లే..



'ప్రేమదేశం' సినిమాతో యూత్ ఫేవరెట్ హీరోగా మారాడు అబ్బాస్. ఆ తర్వాత ప్రేమకథా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడంతో పాటుగా లవర్ బాయ్ అనే ట్యాగ్ దక్కించుకున్నాడు. అయినప్పటికీ కొద్ది కాలం తర్వాత అవకాశాలు తగ్గాయి. దీంతో సినిమా ఇండస్ట్రీకి కొంత గ్యాప్ ఇచ్చిన అబ్బాస్ హార్పిక్ యాడ్‌లో చేశాడు. దీంతో ఆయనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సిల్కర్ స్క్రీన్‌పై హ్యాండ్సమ్ హీరోగా కనిపించిన అబ్బాస్ యాడ్‌లో చూడలేకపోయిన అభిమానులు కూడా ఆందోళన చెందారు. ఆ తర్వాత ఆయన ఇండియాలోనే కనిపించలేదు.కుటుంబం కోసం విదేశాలకు వెళ్లిపోయాడు.మళ్లీ ఇటీవల వచ్చిన జీవి ప్రకాష్ 'హ్యాపీరాజ్' సినిమాతో ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చాడు.అయితే ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో పాటుగా అభిమానుల ఆనందానికి కారణమైంది. అలాగే క్రైమ్ థ్రిల్లర్ ఎగ్జామ్ వెబ్ సిరీస్‌లోనూ నటించాడు. ఇది కూడా సూపర్ హిట్ కావడంతో ప్రస్తుతం ఆయనకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అబ్బాస్ చేతిలో ఒక్క సినిమా ప్రాజెక్ట్ కూడా లేని కష్టకాలంలో ఆ హార్పిక్ బ్రాండ్ తనకు దేవుడిలా అండగా నిలిచిందని అబ్బాస్ పేర్కొన్నాడు.

"హార్పిక్ యాడ్ చేయడం వల్లే నా ప్లేట్‌లోకి అన్నం వచ్చింది. దాదాపు ఎనిమిది సంవత్సరాల పాటు ఆ యాడ్ కాంట్రాక్ట్ ద్వారా లభించిన డబ్బుతోనే నేను నా కుటుంబాన్ని పోషించాను. ఆర్థికంగా అంతో ఇంతో స్థిరపడగలిగాను. ఆ బ్రాండ్ యాజమాన్యం నన్ను ఎంతో సపోర్ట్ చేసింది" అని అబ్బాస్ వివరించాడు.


## ఫుల్ స్వింగ్‌లో 'కింగ్100' షూటింగ్..



టాలీవుడ్ మన్మధుడు అక్కినేని నాగార్జున ఇప్పటికీ వరుస సినిమాలతో కుర్ర హీరోలకు గట్టి పోటీనిస్తున్నారు. ఆయన కొడుకులు అక్కినేని అఖిల్, అక్కినేని నాగచైతన్య కంటే యంగ్‌గా కనిపిస్తూ.. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఇకఆయన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో టబు కీలక పాత్రలో నటిస్తోంది. నాగార్జునకు జోడీగా ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా కనిపించనుంది. యాక్షన్ డ్రామా ఎమోషన్స్ కలిపి దీనిని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ సైలెంట్‌గా దూసుకెళ్తోంది. అంతేకాకుండా దాదాపు షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం.

త్వరలోనే చిత్రీకరణ పూర్తి చేస పోస్ట్ ప్రొడక్షన్ పనులపై ఫోకస్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోందట. మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను విడుదల చేసేందుకు సోలో తేదీతో పాటు స్పెషల్‌గా థియేటర్స్‌లోకి తీసుకురావాలని మూవీ మేకర్స్ చూస్తున్నారట. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీని ఈ ఏడాది దసరా పండుగ కానుకగా అక్టోబర్ 20కి థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్. టైటిల్ ఖరారు కానీ ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, టీజర్‌ను కూడా త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ అప్డేట్‌తో అక్కినేని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## 'డ్రాగన్' సినిమాలో మలయాళ ముద్దుగుమ్మ!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందిఈ సినిమా గురించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దర్శన రాజేంద్రన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఆమె ఇప్పటికే షూటింగ్‌లో కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది.

మూవీలో ఆమె పాత్ర చాలా ఎమోషనల్‌గా, కథను మలుపు తిప్పే విధంగా ఉంటుందని సమాచారం. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా.. జూలై నెలలో చిత్ర యూనిట్ శ్రీలంక వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ ఒక భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది షూటింగ్ పూర్తి చేసుకుని, వచ్చే ఏడాది అంటే 2027, జూన్ 11న 'డ్రాగన్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.

## రాత్రింబవళ్ళు కష్టపడే ఆ లక్షలాది మంది సిబ్బందికి దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు



బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'భారత్ భాగ్య విధాత'. ఈ సినిమా 2008 ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కింది. మనోజ్ తపాడియా దర్శకత్వం వహించగా.. ఈ మూవీని మణికర్ణిక ఫిల్మ్స్, పరమాన్స్ క్రియేషన్స్, యునోయా ఫిల్మ్స్ ఫ్లోటింగ్ రాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సంయుక్తంగా నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని జూన్ 12న థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగనా.. సమాజంలో నర్సులు, హెల్త్‌కేర్ సిబ్బందిని చూసే విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నర్సుల పట్ల ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని కోరారు.

"మన సమాజంలో నర్సింగ్ వృత్తిని చాలా తక్కువ చేసి చూస్తారు. నిజం చెప్పాలంటే, దాన్ని ఒక గ్లామర్ వృత్తిగా మార్చేశారు. హాస్పిటల్‌కు వస్తే నర్సులతో కాసేపు టైమ్‌పాస్ మాట్లాడొచ్చు అనే చులకన భావం చాలామందిలో ఉంది. మా సినిమాలో కూడా దీనిపై ఒక డైలాగ్ ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. మనం హాస్పిటల్ అనగానే కేవలం డాక్టర్ల గురించే ఆలోచిస్తామని, కానీ రోగులను శుభ్రం చేయడం నుండి హాస్పిటల్‌ను నడపడం వరకు ప్రతి పనినీ నర్సులే చూసుకుంటారని కంగనా గుర్తుచేశారు. రాత్రింబవళ్ళు కష్టపడే ఆ లక్షలాది మంది సిబ్బందికి దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని అన్నారు. ఈ సినిమా చూశాకైనా నర్సుల పట్ల ప్రజల చూపులో కొంచెం మార్పు వచ్చినా, తమ ప్రయత్నం విజయవంతమైనట్లేనని కంగనా రనౌత్ తెలిపారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in